బీజేపీ అధ్యక్షుల నియామకం



బోర్డు సభ్యుడు రామకృష్ణను కలిసిన బీజేపీ నూతన వార్డు అధ్యక్షులు

కంటోన్మెంట్: కంటోన్మెంట్ నియోజకవర్గం ఎనిమిది వార్డులు, డివిజన్‌లకు బీజేపీ నూతన అధ్యక్షులను నియమించింది. బోర్డు పరిధిలోని ఎనిమిది వార్డులతో పాటు జీహెచ్‌ఎంసీ పరిధి లోకి వచ్చే 150 డివిజన్ (మోండా) కొత్తగా అధ్యక్షులను నియమించినట్లు కంటోన్మెంట్ బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామకృష్ణ తెలిపారు.

నూతన అధ్యక్షులు వీరే..

జైపాల్ రాకేష్ (వార్డు -1), మండుల శ్రావణ్ (వార్డు 2), ఐతా అరుణ్ (వార్డు 3), సచిన్ ఖంకే (వార్డు 4), బల్దా సంతోష్ కుమార్ (వార్డు 5), ప్రతీక్ లోధా (వార్డు 6). పవన్ కుమార్ (వార్డు 7), పింజర ప్రవీణ్ (వార్డు 8), బన్సిలాల్ జితేంద్ర కుమార్ (150 డివిజన్)

ఘనంగా వడ్డె ఓబన్న జయంతి



అడ్డగుట్ట: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న ఆశయ సాధన కోసం కృషి చేస్తామని వడ్డెర సంఘం నాయకులు గోగుల స్వామి అన్నారు. తుకారాంగేట్‌లోని రియో పాయింట్ చౌరస్తాలో వడ్డె ఓబన్న జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం, గోగుల స్వామి మాట్లాడుతూ గెరిల్లా యుద్ధాన్ని నడిపిన వీర యోధుడు వడ్డె ఓబన్న అని కొనియాడారు. వడ్డెర సంఘం నాయకులు వరికొప్పుల శ్యామ్, గణేష్, ఎల్లయ్య, సంతోష్, రాజేష్, స్వామి, శ్రీను, యాదగిరి, వెంకటేష్, నర్సింహా, ఉదయ్ పాల్గొన్నారు.

ఓయూలో 180 ఇంకుడు గుంతల నిర్మాణం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో 180 ఇంకుడు గుంతలను నిర్మిస్తున్నారు. స్వచ్ఛంద సంస్థ ఆర్థిక సహకారంతో రూ.30 లక్షల వ్యయంతో యూనివర్సిటీ క్యాంపస్‌లో ఆధునికంగా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయనున్నట్లు సెంటర్ ఫర్ బయోడైవర్సిటీ అండ్ కంజర్వేషన్ స్టడీస్ డైరెక్టర్ ప్రొ.శ్రీనివాసులు తెలిపారు. వర్షపు నీరు నిల్వచేసేందుకు ఇంకుడు గుంతలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. క్యాంపస్‌లోని మెయిన్ చెరువును సైతం మరమ్మతు చేయించనున్నట్లు చెప్పారు.

జంక్షన్.. టెన్షన్

- రద్దీ, ప్రమాదాలు లేకున్నా మూసివేత ఎందుకు?
- యూ టర్న్‌లతో దూరాభారం, ఇబ్బందులు
- మెట్టుగూడ ప్రజల డిమాండ్

మెట్టుగూడ జంక్షన్ మూసివేతను ఎత్తివేయాలి



మూసివేసిన మెట్టుగూడ జంక్షన్

సికింద్రాబాద్: సికింద్రాబాద్-తార్నాక ప్రధాన మార్గంలోని మెట్టుగూడ జంక్షన్ మూసివేతను తొలగించాలని స్థానిక ప్రజలు, ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. ఏడేళ్ల క్రితం తార్నాక జంక్షన్‌ను మూసివేసిన తరుణంలోనే అప్పటి జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసు అధికారులు మెట్టుగూడ జంక్షన్‌ను మూసివేసి 'యూ' టర్న్‌లను అందుబాటులోకి తెచ్చారు. వేలాది వాహనాల రాకపోకలు ఉండే తార్నాక జంక్షన్ మూసివేతను ఎత్తివేయాలని, జంక్షన్ మీదుగా వాహనాల రాకపోకలను పునరుద్ధరించేందుకు అధికారులు ఈ మధ్య నిర్ణయం తీసుకున్నారు. ఆ దిశగా చర్యలు కొనసాగుతున్నాయి.

- తార్నాక కూడలితో బేరీజు వేసుకుంటే మెట్టుగూడ జంక్షన్ వద్ద వాహనాల రాకపోకల సంఖ్య చాలా తక్కువ. ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యలు కూడా ఇక్కడ నామమాత్రంగానే ఉంటున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో మెట్టుగూడ జంక్షన్ మూసివేత సమంజసం కాదని మెట్టుగూడ ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జంక్షన్ మూసివేతను ఎత్తివేసి, కూడలి మీదుగా వాహనాల రాకపోకలను పునరుద్ధరించి తమ ఇబ్బందులు తొలగించాలని మెట్టుగూడ ప్రజలు కోరుతున్నారు.
- మెట్టుగూడ ప్రాంత బస్తీలు, కాలనీల ప్రజలు తార్నాక వైపు వెళ్లేందుకు ఆలుగడ్డబావి వంతెన వద్ద 'యూ' టర్న్ తీసుకునే వెసులుబాటు కల్పించారు. శాంతినగర్, మల్కాజిగిరి నుంచి సికింద్రాబాద్ వెళ్లే వాహనాలు యూ టర్న్ తీసుకోవడం కోసం రెండున్నర కిలోమీటర్లు తిరగాల్సి వస్తుంది. మెట్టుగూడ ప్రజలు తార్నాక, శాంతినగర్ వెళ్లడం కోసం ఆలుగడ్డబావి వద్ద మలుపు వద్ద ప్రమాదకర పరిస్థితులు దాటుకోవాల్సి వస్తుంది.

పాదచారులకు నిత్య నరకం..

కూడలిలో పాదచారుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఇక్కడ పాదచారుల కోసం ప్రత్యేకంగా సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేసినప్పటికీ పాదచారులకు ప్రమాదకర పరిస్థితులే ఎదురవుతున్నాయి. తార్నాక-సికింద్రాబాద్ వాహనాల రాకపోకలు ఒకవైపు, మెట్రో ప్రయాణికుల సందడి మరోవైపు ఉంటుండడంతో ఇబ్బందికర పరిస్థితుల మధ్యే రోడ్డు దాటాల్సిన పరిస్థితులు ఇక్కడ నెలకొన్నాయి.

- ఎక్కువ సంఖ్యలోని మెట్టుగూడ వాసులు కార్యాలయాలకు వెళ్లడం, పిల్లలను విద్యాలయాలకు తీసుకువెళ్లడం కోసం ఆలుగడ్డబావి బస్‌స్టాప్ ప్రాంతంలోని యూ టర్న్‌ను వినియోగించుకుంటున్నారు. ఇక్కడ మరీ ప్రమాదకర పరిస్థితులు ఉంటుండడం గమనార్హం.

యూ టర్న్‌లు.. ఇబ్బందులు..

మెట్రో కారిడార్‌ల నిర్మాణం, రహదారుల విస్తరణ సమయంలో ఏడేళ్ల క్రితం ట్రాఫిక్ పోలీసులు మెట్టుగూడ జంక్షన్‌ను మూసివేశారు. ఆ సమయంలో స్థానికులు ఆందోళనలకు దిగినా అధికారులు పెద్దగా పట్టించుకోలేదు. రైల్వే కాలనీలు, మల్కాజిగిరి, లాలాగూడ నుంచి వచ్చే వాహనాలు జంక్షన్ నుంచి కిలోమీటర్ దూరం వెళ్లి రైల్వే డిగ్రీ కళాశాల ప్రాంతంలో 'యూ' టర్న్ చేసుకునేందుకు ఏర్పాట్లు చేశారు.

'ఫుట్‌పాత్ వ్యాపారులకు అండగా ఉంటా'



సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్.

సనత్‌నగర్: ఫుట్‌పాత్ వ్యాపారులకు అండగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మోండా డివిజన్‌లోని పాలికాబజార్, మోండా మార్కెట్, 31 బస్టాప్, ఓల్డ్ జైల్‌ఖానా ప్రాంతాల్లోని ఫుట్‌పాత్ వ్యాపారులు, హాకర్స్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యదవ్‌ను శనివారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఫుట్‌పాత్‌లపై చిన్న చిన్న వ్యాపారాలు నిర్వహించుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నామని, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తున్నారంటూ ట్రాఫిక్ పోలీసులు తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో హాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి అశోక్ ఉన్నారు.

ట్రస్మా జిల్లా ప్రధాన కార్యదర్శిగా శివరామక్రిష్ణ ఆచార్య



శివరామక్రిష్ణ ఆచార్య

బన్సీలాల్‌పేట్: తెలంగాణ రాష్ట్ర గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాల సంఘం హైద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎస్. శివరామక్రిష్ణ ఆచార్య ఎన్నికయ్యారు. ఇటీవల 33 జిల్లాలకు చెందిన ట్రస్మా రాష్ట్ర కార్యవర్గం సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. సికింద్రాబాద్ బోలక్‌పూర్ ఎస్ఆర్‌కే విద్యా సంస్థల ఆధినేతగా ఎస్. శివరామక్రిష్ణ ఆచార్య కొనసాగుతున్నారు. ట్రస్మా హైద్రాబాద్ జిల్లా అధ్యక్షులుగా వీరేంద్ర యాదవ్, ప్రధాన కార్యదర్శిగా శివరామక్రిష్ణ ఆచార్య, కోశాధికారిగా సోహెల్‌లు ఎంపికయ్యారు. శనివారం బోలక్‌పూర్‌లో విలేకరుల సమావేశంలో ట్రస్మా హైద్రాబాద్ ప్రధాన కార్యదర్శి ఎస్. శివరామక్రిష్ణ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా సంఘం పేరు ప్రతిష్టతలను ఇనుమడింపజేయడానికి కృషి చేస్తానని చెప్పారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో విద్యా ప్రమాణాల మెరుగు కోసం ట్రస్మా కృషి చేస్తుందన్నారు.

మెగా జాబ్‌మేళాకు అనూహ్య స్పందన



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న టీసీఎస్ ప్రతినిధులు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ సెయింట్ మేరీస్ సెంటినరీ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాకు అనూహ్య స్పందన లభించింది. శని, ఆదివారాల్లో నిర్వహించనున్న ఈ జాబ్ మేళాకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి బీటెక్, మేనేజ్‌మెంట్ పూర్తి చేసిన సుమారు 1500 మంది శనివారం హాజరయ్యారు. కళాశాల డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ ఆంటోని వినయ్ ప్రారంభించారు. టీసీఎస్ సంస్థలో పనిచేసేందుకు నిర్వహించిన ఈ జాబ్ మేళాలో పాల్గొన్న 300 మంది అభ్యర్థులకు శనివారం నియామకపు పత్రాలను అందించారు. ఆదివారం కూడా అధిక సంఖ్యలో నిరుద్యోగ యువత పాల్గొనే అవకాశాలున్నాయని ఫాధర్ ఆంటోని వినయ్ తెలిపారు.

కనుల పండువగా శ్రీనివాస కల్యాణం



స్వామివారి కల్యాణోత్సవ దృశ్యం

చిలకలగూడ: నామాలగుండు కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో అలంకరించి, మేళతాళాలు, బాజా భజంత్రీలు, వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య స్వామి వారి కళ్యాణం కనుల పండువగా నిర్వహించారు. శుక్రవారం అర్ధరాత్రి తర్వాత వైకుంఠ ఏకాదశి వేడుకలు ముగిసినట్లు ఆలయ చైర్మన్ నోముల ప్రకాశ రావు ప్రకటించారు. ముక్కోటి ఏకాదశి వేడుకలు విజయవంతంగా నిర్వహించిన ఆయనను పలువురు గజమాలలతో సత్కరించారు. చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అనుదీప్‌ల పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు.

అభివృద్ధి పనులపై దృష్టి సారిస్తా..

కంటోన్మెంట్ బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

కంటోన్మెంట్: రెండేళ్లుగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యుడిగా ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేశానని.. తన పనితీరుకు మెప్పుగానే కేంద్రం మరో ఏడాది పాటు బోర్డు సభ్యుడిగా కొనసాగే అవకాశం కల్పించిందని రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తాను 2022 నవంబర్లో సివిలియన్ నామినేటెడ్ సభ్యుడిగా నియమితుడిని అయ్యానని, అంతకు ముందు మూడేళ్ల పాటు బోర్డు సభ్యుడిగానూ పనిచేశానన్నారు. తన పదవీకాలంలో గణనీయమైన అభివృద్ధి సాధించామన్నారు. 133 గజాల లోపు విస్తీర్ణం కలిగిన స్థలాల్లోనూ నిర్మాణ అనుమతులు ఇవ్వడం మొదలుపెట్టామన్నారు. దీంతో బస్తీల్లోని వేలాది మంది ప్రజలకు బోర్డు అనుమతులతో ఇళ్లు నిర్మించుకునే అవకాశం కలిగిందని పేర్కొన్నారు. కంటోన్మెంట్ పరిధిలోని నిర్మాణాలకు పార్కింగ్ కోసం ఉపయోగించే గ్రాండ్ ఫ్లోర్‌తో పాటు బాల్కనీలు, మెట్లు, వాచ్‌మెన్ రూమ్, జనరేటర్, ఏసీ రూములను ఎఫ్ఎస్ఐ నుంచి మినహాయించామన్నారు. దీంతో ఎఫ్ఎస్ఐ పరిమితి 1.5 నుంచి 2.1కు చేరిందన్నారు. భవన నిర్మాణ అనుమతుల కోసం ఓబీ-పాస్‌ను అమలు చేయడం వల్ల పక్షం రోజుల్లోనే అనుమతులు జారీ అవుతున్నాయన్నారు. ఇతర పౌర సేవలను సైతం ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెచ్చామన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేసేలా బీజేపీ తరపున పోరాటాలు తీవ్రతరం చేస్తామన్నారు.

స్థానికత సమస్యను పరిష్కరించండి



మంత్రి దామోదర రాజనర్సింహకు సమస్యను తెలియజేస్తున్న 317 జీఓ బాధిత ఉద్యోగులు

లాలాపేట: రాష్ట్ర మంత్రి, 317 జీఓ క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్ దామోదర రాజనర్సింహను ఆయన కార్యాలయంలో శనివారం 317 జీఓ బాధిత ఉద్యోగు, ఉపాధ్యాయ జేఏసీ నాయకులు కలిశారు. తమ స్థానికత సమస్యను పరిష్కరించి తమ జిల్లా జోన్‌లలో కేటాయించాలనీ మంత్రికి వినతి పత్రాన్ని అందజేశారు.

కేలండర్ ఆవిష్కరణ



సనత్‌నగర్: ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ప్రశాంత్, సుధాకర్, వెంకట పవన్, ప్రసాద్, అగస్టీన్, కుతుబుద్దీన్ పాల్గొన్నారు.

వైభవంగా కూడారై ఉత్సవం



సనత్‌నగర్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా 27వ రోజైన శనివారం సనత్‌నగర్ హనుమాన్ దేవాలయ ప్రాంగణంలోని శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడారై ఉత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి 108 గంగాళాలతో పాయసాన్న నైవేద్యం సమర్పించారు. అంతకుముందు తిరుప్పావై పాశురాల పారాయణం, విష్ణు సహస్ర స్తోత్ర పారాయణం నిర్వహించారు. స్వామి వారు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈఓ సత్యనారాయణ పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు పరాశరం రవీంద్రాచార్యుల ఆధ్వర్యంలో ఆయా పూజా కార్యక్రమాలు కొనసాగాయి.

మణికంఠుడికి బంగారు ధనుర్బాణాలు



శబరిమల ఆలయ నిర్వాహకులకు బంగారు ధనుర్బాణాలు అందిస్తున్న రమేష్‌గురుస్వామి

చిలకలగూడ: సికింద్రాబాద్ మైలార్‌గడ్డకు చెందిన జ్ఞానేశ్వరీ క్యాటరర్స్ అధినేత ఆకారం రమేష్ గురుస్వామి, తనయుడు అఖిల్‌రాజ్ శబరిమల అయ్యప్పస్వామి ఆలయానికి 11 తులాల బంగారు ధనుర్బాణాలు, రెండు వెండి ఏనుగులను వితరణగా అందించారు. చిలకలగూడ అంజనీ పుత్ర భక్తసమాజం నేతృత్వంలో పలువురు మాలధారులు శనివారం శబరికొండకు చేరుకున్నారు. ప్రత్యేకంగా రూపొందించిన బంగారు విల్లు, బాణాలు, వెండి ఏనుగులకు ప్రత్యేక పూజలు నిర్వహించి శబరిమల అయ్యప్పస్వామి ఆలయ నిర్వాహకులకు అందించారు.

పోలీస్ సేవలపై క్యూఆర్ కోడ్ ఏర్పాటు

చిలకలగూడ: తెలంగాణ పోలీసులు అందిస్తున్న సేవలపై ప్రజల అభిప్రాయం సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పోలీస్‌శాఖ రూపొందించిన క్యూఆర్ కోడ్‌ను చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాసులు శనివారం ఠాణా ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే పిటిషన్, ఎఫ్ఐఆర్, ఈ చలాన్, పాస్‌పోర్టు ధృవీకరణ తదితర విభాగాలలో ప్రజల అభిప్రాయాలను సేకరిస్తారు. ఆయా ఠాణాలో ప్రజలకు ఎదురైన అనుభవాలను క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఉన్నతాధికారులకు అందించవచ్చన్నారు.

మందుబాబుల ఆగడాలను అరికట్టండి



ఇన్‌స్పెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రాంగోపాల్‌పేట్: పాన్‌బజార్‌లోని జైన్ మందిర్ వద్ద మందుబాబుల ఆగడాలు పెరిగిపోతున్నాయని వాటిని అరికట్టాలని దేవాలయ కమిటీ మహంకాళి ఇన్‌స్పెక్టర్ పరశురాంను కోరింది. బీజేపీ రాష్ట్ర ఓబీసీ ఉపాధ్యక్షులు చీర శ్రీకాంత్ ఆధ్వర్యంలో శనివారం కమిటీ ప్రతినిధులు బద్రీ ఎ, శ్రేయేష్ అల్కేష్, కిరణ్, నితిన్, పరాగ్, మనోజ్‌లు ఇన్‌స్పెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. దేవాలయం పక్కన మద్యం దుకాణం ఉండటంతో మందుబాబులు అక్కడే మద్యం సేవిస్తుండటంతో దేవాలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగుతున్నాయని, అక్కడే మూత్ర విసర్జన చేస్తూ వాతావరణం దుర్గంధం చేస్తున్నారని వారు తెలిపారు. మద్యం దుకాణం అక్కడి నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సందడిగా సంక్రాంతి వేడుకలు

అడ్డగుట్ట: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని తుకారాంగేట్‌లోని విద్యావాహిని స్కూలులో శనివారం సంక్రాంతి వేడుకలు జరుపుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు స్కూల్ ఆవరణలో ఎంతో ఉత్సాహంగా భోగీ మంటలు వేశారు. కార్యక్రమంలో స్కూల్ సెక్రటరీ గోపాలకృష్ణ, కరస్పాండెంట్ వసంత, హెడ్ మిస్ట్రస్ సంధ్యారాణి పాల్గొన్నారు.

పద్మారావునగర్: భోలక్‌పూర్ క్రిష్ణానగర్‌లోని శ్రీ క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో శనివారం సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. రంగు రంగుల ముగ్గులు అలరించాయి. గాంధీనగర్ ఏఎస్ఐ ప్రభాకర్ బహుమతులను అందజేశారు.



ముగ్గుల పోటీలో విద్యార్థులు



మూలం సంతకు విశేష ఆదరణ



లాలాపేట: ప్రకృతి వ్యవసాయ దారులు, గోఆధారిత వ్యవసాయ రైతుల మార్కెట్టే ఈ మూలం సంత అని నిర్వాహకులు తెలియజేశారు. ఈ మేరకు గ్రామభారతీ, సిఎస్ఆర్ మోమోరియల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తార్నాకలోని మర్రి కృష్ణా హాల్లో ఏర్పాటు చేసిన 8వ మూలం సంతకు విశేష ఆదరణ లభించింది. ఇందులో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి రైతులు పాల్గొని దాదాపు 100 వరకు స్టాల్స్ ఏర్పాటు చేశారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గోమాత పూజలు చేశారు. ప్రత్యేకంగా సకినాలు, పిండి వంటలు వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. ఆరోగ్యాన్ని కోరుకునే వారందరూ ఈ మూలం సంతను ఆదరించాలనీ కోరారు. మూలం సంతలో దవా చాయ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

పతంగి ఎగురవేసిన డిప్యూటీ మేయర్



లాలాపేట: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శనివారం తార్నాకలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్‌రెడ్డితో కలిసి పంతంగులు ఎగురవేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ నిషేధిత చైనా మాంజాను ఎవరూ ఉపయోగించవద్దని సూచించారు.

సందడిగా రంగవల్లుల పోటీలు

చిలకలగూడ: సంక్రాంతి సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో సీతాఫల్‌మండి డివిజన్ బీదలబస్తీ మైదానంలో బీజేపీ నాయకురాలు మేకల కీర్తిహర్షకిరణ్ నేతృత్వంలో శనివారం రంగవల్లుల పోటీలు నిర్వహించారు. వంద మందికి పైగా మహిళలు పోటీల్లో పాల్గొని రంగురంగుల అలంకరణలతో చూడముచ్చటైన ముగ్గులను తీర్చిదిద్దారు. దేశభక్తి, పర్యావరణ పరిరక్షణ, గంగిరెద్దులు, గాలిపటాలు ఆకృతులతో వేసిన రంగవల్లులు చూపరులను ఆకట్టుకున్నాయి. బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు శ్యామ్‌సుందర్‌గౌడ్, మేకల సారంగపాణి, ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి ముఖ్యఅతిథులుగా హాజరై విజేతలు, పోటీల్లో పాల్గొన్న మహిళలకు బహుమతులు అందజేశారు.

